



ప్రెస్‌క్లబ్ కోసం కేటాయించిన ప్రభుత్వ క్వార్టర్స్‌ను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఎంఏ.గఫూర్

మెడికల్ కాలేజీ గ్రౌండ్‌కు ఎసరు

– మళ్లీ పర్సన్ భవన నిర్మాణాల పేరుతో కొలతలు - అడ్డుకున్న వైద్య విద్యార్థులు, వైద్యులు

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

కర్నూలు మెడికల్ కాలేజీ గ్రౌండ్‌కు ఎసరు పెట్టే ప్రయత్నాలను వైద్య విద్యార్థులు, వైద్యులు మంగళవారం అడ్డుకున్నారు. అల్యూమిని ట్రస్ట్ పేరుతో ఓల్డ్ విద్యార్థులు ఎన్నారై ఫండ్స్ తెచ్చి మల్టీపర్పస్ భవనాలు కట్టిస్తామనే పేరుతో మెడికల్ కాలేజీ గ్రౌండ్‌లోని 60 సెంట్ల (సుమారు రూ.60 కోట్లు) స్థలానికి ఎసరు పెట్టే ప్రయత్నాలు జోరందుకున్నాయి. మంగళవారం కొలతలు వేయడానికి ఓల్డ్ విద్యార్థుల పేరుతో వచ్చిన వారిని వైద్య విద్యార్థులు, ప్రభుత్వ వైద్యులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వైద్య విద్యార్థులు, వైద్యులు మాట్లాడుతూ మెడికల్ కాలేజీలో 2500 మంది వైద్య విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని చెప్పారు. విద్యార్థులకు గ్రౌండ్ లేకుండా చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఇప్పటికే అనేకమంది విద్యార్థులు మానసిక ఒత్తిళ్లతో సతమతమవుతూ అనేక ఘటనలకు పాల్పడుతున్న దృశ్యాలు చూస్తున్నామని చెప్పారు. ఇలాంటి పరిస్థితులలో విద్యార్థులకు శారీరకంగా, మానసికంగా ఉపయోగపడే మెడికల్ కాలేజీ గ్రౌండ్‌ను తీసుకోవడం సరైనది కాదన్నారు. ఈ గ్రౌండ్ మొత్తం గతంలో 8 ఎకరాలు ఉండగా అందులో కొంత నర్సింగ్ కాలేజీకి ఇచ్చారని, ప్రస్తుతం 5.5 ఎకరాలు కాగా అందులో 60 సెంట్లు తీసుకుంటే గ్రౌండ్ లేకుండాపోయే ప్రమాదం ఉందన్నారు. ఇప్పటికే మెడికల్ కాలేజీ గ్రౌండ్ అనేక ఆక్రమణలకు గురైయిందని, ఇది కూడా తీసుకుంటే గ్రౌండే ఉండదని ఆరోపించారు. బిల్డింగ్, అభివృద్ధి, లాభాపేక్ష పేరుతో ఓల్డ్ స్టూడెంట్స్ ప్రస్తుత గ్రౌండ్‌కు ఎసరు పెట్టడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. మెడికల్ కాలేజీ, హాస్పిటల్‌కు విశాలమైన స్థలం ఉంది కాబట్టి ప్రజలకు, వైద్య విద్యార్థులకు అవసరమైన హాస్పిటల్ విస్తరణకు, కాలేజీలోని వివిధ విభాగాల విస్తరణకు ఉపయోగపడుతుందన్నారు. అలా కాకుండా స్థలం దుర్వినియోగం అయితే భవిష్యత్తులో ఇబ్బందికరంగా మారవచ్చన్నారు. ఈ స్థలం ఉంది కాబట్టి ఇక్కడ స్టేట్ క్యాన్సర్ ఇన్స్టిట్యూట్ ఏర్పాటు చేసుకున్నామని, అది ప్రజలకు ఉపయోగ పడుతుందని తెలిపారు. అనంతపురంలో మెడికల్ కాలేజీ, హాస్పిటల్, సూపర్ స్పెషాలిటీ విభాగం వేరువేరుగా ఉండడంతో అనేక ఇబ్బందులు పడుతున్నారని, అలాంటి ఇబ్బందుల్లోకి కర్నూలు మెడికల్ కాలేజీని తీసుకురావద్దని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ జెడిఎ జిల్లా అధ్యక్షులు డాక్టర్ బ్రహ్మాజీ మాస్టర్, డాక్టర్ రమణ, డాక్టర్ విజయ శంకర్, డాక్టర్ విజయబాబు, డాక్టర్ నాగేశ్వరరావు, డాక్టర్ సుధీర్ బాబు, పీజీలు, హౌస్‌సర్జన్స్, ఎంబిబిఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.



కర్నూలు మెడికల్ కళాశాల



కొలతలను తక్షణమే ఆపాలని డిమాండ్ చేస్తున్న వైద్య విద్యార్థులు, వైద్యులు

ప్రెస్‌క్లబ్‌ను ఉచితంగా కేటాయించాలి

- సిపిఎం మాజీ కేంద్ర కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే ఎంఏ గఫూర్

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ప్రెస్‌క్లబ్‌ను జర్నలిస్టులకు ఉచితంగానే కేటాయించాలని సిపిఎం మాజీ కేంద్ర కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే ఎంఏ గఫూర్ డిమాండ్ చేశారు. మంగళవారం కర్నూల్ నగరంలోని ఏ.క్యాంపులో జర్నలిస్టులకు ప్రెస్‌క్లబ్ ఏర్పాటుకు కేటాయించిన క్వార్టర్స్‌ను ఎంఏ గఫూర్ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో ఇప్పటివరకు ప్రెస్ క్లబ్ లేదన్నారు. ప్రెస్‌క్లబ్ ఏర్పాటు కోసం కేటాయించిన క్వార్టర్స్‌కు ఎలాంటి బాడిగ లేకుండా ఉచితంగా ఇవ్వాలన్నారు. ప్రెస్‌క్లబ్ ఏర్పాటుకు సంబంధించి ప్రభుత్వమే నిధులను కేటాయించి భవన నిర్మాణాలు చేపట్టడమే కాకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఎన్నో సంవత్సరాల క్రితమే కర్నూల్‌లో ప్రెస్ క్లబ్ ఏర్పాటు జరగాల్సి ఉందని, ఏ కారణం చేతనో ఏర్పాటు చేయలేదన్నారు. ఏదేమైనా కర్నూల్‌లో ప్రెస్‌క్లబ్ ఏర్పాటుకు ప్రభుత్వ క్వార్టర్స్ జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా మంజూరు చేయడం అభినందనీయమని అన్నారు. గతంలో రాష్ట్ర రాజధాని. కర్నూలులో ఏర్పాటు చేస్తున్న సమయంలో నిర్మాణం జరిగిందని, ఈ రోజు పలు ప్రభుత్వ క్వార్టర్స్ దుస్థితి అధ్వానంగా ఉన్నాయని, ఏదేమైనా శాశ్వత ప్రెస్‌క్లబ్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. ప్రజా సంఘాలు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వానికి తీసుకొచ్చేందుకు ప్రెస్‌క్లబ్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ప్రెస్‌క్లబ్ ఏర్పాటుకు కృషి చేసిన అధ్యక్షులను అభినందించారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సత్యనారాయణ గుప్తా, నీలం సత్యనారాయణ, సీనియర్ జర్నలిస్టులు చిన్న రామాంజనేయులు, విజయ్, కరణ్ తదితరులు పాల్గొన్నారు.

15 శాతం వృద్ధి సాధించేలా చర్యలు

- కలెక్టర్ రంజిత్ బాషా

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

స్వర్ణాంధ్ర విజన్ ప్రణాళిక అమలులో భాగంగా ప్రతి ఏడాది 15 శాతం వృద్ధి సాధించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా జిల్లా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో స్వర్ణాంధ్ర విజన్ ప్లాన్– కీ పెర్ఫార్మెన్స్, ఇండికేటర్స్ లక్ష్యాల సాధన అంశాలపై జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గత ఆర్థిక సంవత్సరంలో సాధించిన ఫలితాలను పోర్టల్‌లో అప్లోడ్ చేయాలని అధికారులను ఆదేశించారు. 2025–26 సంవత్సరానికి నిర్దేశించిన నెల, త్రైమాసం, అర్ధ సంవత్సరం, సంవత్సర లక్ష్యాలను కూడా పొందుపరచాలన్నారు. అలాగే జిల్లాకు నిర్దేశించిన టార్గెట్‌లను మండల వారిగా విభజించి పోర్టల్‌లో అప్లోడ్ చేయాలన్నారు. ఆగస్టు 8వ తేదీ లోపు మండల స్థాయి డేటా ఎంట్రీని పూర్తి చేయాలని సూచించారు. మండల వారిగా నిర్దేశించిన లక్ష్యాలను వంద శాతం సాధించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వివరాలను పోర్టల్లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. ప్రతి నెలా పని తీరు సూచికల లక్ష్యాల సాధనపై సమీక్షలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. సమావేశంలో డిఆర్ఒ వెంకట నారాయణమ్మ, సిపిఒ హిమ ప్రభాకర్ రాజు, ఏడి భారతి, విద్యుత్ శాఖ ఎస్ఈ ఉమాపతి, జడ్పి సీఈవో నాసర రెడ్డి, హౌసింగ్ పీడీ చిరంజీవి, డిడబ్ల్యుఎంఏ పిడి వెంకట రమణయ్య, ఆర్డబ్ల్యూ ఎస్ ఎస్ఈ నాగేశ్వరరావు, జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధం అమలు చేయాలి

- కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ పి.కృష్ణయ్య

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ప్లాస్టిక్ వస్తువుల నిషేధాన్ని అమలు చేయాలని, అన్ని శాఖలు బాధ్యతగా తీసుకుని ఫలితాలు సాధించాలని ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ డాక్టర్ పి.కృష్ణయ్య అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషాతో కలిసి స్టేట్ హోల్డర్ విభాగాలతో కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్టోబర్ 2లోపు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. పట్టణాలు, నగరాల్లో జనాభా ఎక్కువగా ఉండడం వల్ల సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకం ఎక్కువగా ఉందన్నారు. మున్సిపల్ కమిషనర్లు ఈ అంశంలో కీలక పాత్ర పోషించాలని సూచించారు. పట్టణ ప్రాంతాల్లో ఉన్న ఫంక్షన్ హాల్‌లు, కళ్యాణ మండపాలు, ఆస్పత్రులు, షాపింగ్ కాంప్లెక్స్‌లు, ఆస్పత్రులు, కూరగాయల మార్కెట్‌లు, దేవాలయాల్లో, హోటల్స్, చికెన్ షాపులు తదితర ఎక్కువ జనాభా వచ్చే ప్రాంతాలలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ప్రాంతాల్లో ప్లాస్టిక్ వాడకానికి ప్రత్యామ్నాయంగా బట్ట సంచులు, జ్యూట్ బ్యాగ్‌లు, బయో డిగ్రేడబుల్ ప్లాస్టిక్ సంచులను అమ్మేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. చేనేత జౌళి శాఖ సహకారంతో మెప్మా అధికారులు మహిళా సంఘాల సభ్యులతో బట్ట సంచులు తయారు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో కూడా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం అమలయ్యేలా డిపిఒ, డిఎల్‌పిఒలు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రధాన మంత్రి ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రాం ద్వారా జ్యూట్ బ్యాగ్, బయో డిగ్రేడబుల్ ప్లాస్టిక్ సంచుల ఉత్పత్తి చేసేందుకు చిన్న చిన్న యూనిట్‌లు ఏర్పాటు చేసేందుకు ప్రమోట్ చేయాలని ఆదేశించారు. ఉద్యాన పంటల సాగులో మల్చింగ్ షీట్స్ ఉపయోగించకుండా ప్రత్యామ్నాయంగా ఏమి ఉపయోగించాలనే అంశంపై వెరిఫై చేయాలని వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా మాట్లాడుతూ జిల్లాలో అక్టోబర్ 2వ తేది నాటికి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ పూర్తిగా నిషేధించేలా తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. జూన్ 5వ తేదీ నుండి ప్లాస్టిక్ వాడకంపై ప్రజల్లో అవగాహన తీసుకువచ్చేందుకు సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఈఈ కిషోర్ రెడ్డి, కర్నూలు మున్సిపల్ కమిషనర్ విశ్వనాథ్, గనుల శాఖ డిడి రవిచంద్, డిఎస్ఓ రఘువీర్, డిపిఓ భాస్కర్, డిటిసి శాంత కుమారి, మునిసిపల్ కమిషనర్‌లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ పి.కృష్ణయ్య

పాఠశాల సమస్యలు పరిష్కరించాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

కల్లూరు మండలం బొల్లవరం గ్రామంలో ఉన్న నీలం రామచంద్రయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్ డిమాండ్ చేశారు. మంగళవారం నీలం రామ చంద్రయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆయన సిపిఎం మండల కార్యదర్శి కృష్ణతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా డి.గౌస్ దేశాయ్ మాట్లాడుతూ పాఠశాలలో ఉన్న టీచర్లతో మాట్లాడిన సందర్భంగా ఉపాధ్యాయుల కొరత ఉన్నట్లు తెలిసిందన్నారు. విద్యార్థులకు సామూహిక మరుగుదొడ్లు లేవన్నారు. పాఠశాలకు ప్రహరీ కూడా లేదని తెలిపారు. కావున పాఠశాలకు ఆర్డబ్ల్యూఎస్ ద్వారా, హంద్రీనది నుంచి తాగు నీటి వసతి కల్పించాలని కోరారు. అలాగే పాఠశాలలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం శాఖ సభ్యుడు శేఖర్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల కోసం తయారు చేసిన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్ తదితరులు

నెల్లూరు సిఐను సస్పెండ్ చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

రాష్ట్రంలో మున్సిపల్ వర్కర్స్‌ను ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పజెప్పరాదని కోరుతూ నెల్లూరులో 14 రోజులుగా పోరాటం చేస్తున్న మున్సిపల్ కార్మికులపై అమానుషంగా లాఠీచార్జి చేయించిన నెల్లూరు టౌన్ సిఐ శ్రీనివాసరావును వెంటనే సస్పెండ్ చేయాలని సిఐటియు నగర ఉపాధ్యక్షులు రాజశేఖర్ డిమాండ్ చేశారు. సిఐటియు ఓల్డ్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక గడియారం హాస్పిటల్ ముందు కార్మికులతో నిరసన కార్యక్రమం నగర అధ్యక్షులు అబ్దుల్ దేశాయ్ అధ్యక్షతన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు నగర ఉపాధ్యక్షులు రాజశేఖర్, నగర ప్రధాన కార్యదర్శి విజయ రామాంజనేయులు మాట్లాడుతూ ప్రభుత్వ ఆధీనంలో ఉన్న అబ్కాస్ ఏజెన్సీని రద్దు చేసి పారిశుధ్య కార్మికులను మళ్లీ ప్రవేట్ ఏజెన్సీలకు అప్పగించడం వలన సరైన జీతం, ఈఎస్ఐ, పిఎఫ్ ఇతర బెనిఫిట్స్ ఉండకపోగా పని భద్రత కరువవుతుందని అన్నారు. గతంలో మోసపోయిన కార్మికులు జాగ్రత్తతో పోరాడి తమ హక్కులు, కార్మిక చట్టాలను సాధించుకోవాలని, ఇంజనీరింగ్ కార్మికులకు 36 జీవో ప్రకారం జీతాలు అమలు చేయాలని, ఇతర బెనిఫిట్ అమలు చేయాలని 14 రోజులుగా పోరాటం చేస్తుంటే సహించలేని అధికారపక్షం పోలీసుల ద్వారా లాఠీచార్జి చేయించడం దారుణమన్నారు. మద్దతుగా ఉన్న సిఐటియు నాయకులను దుర్భాషలాడి రక్త గాయాలయ్యేల కొట్టి గాయపరిచిన సిఐ శ్రీనివాసరావును వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. పారిశుధ్య కార్మికులను థర్డ్ పార్టీ ఏజెన్సీలకు అప్పగించరాదని, ఇంజనీరింగ్ కార్మికులకు జీవో 36 ప్రకారం జీతాలు ఇవ్వాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులను సమీకరించి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు నగర ఆఫీస్ బేరర్స్ కాజా పాష, నాగస్వాములు, షరీఫ్, షేక్షా, పార్వతయ్య, చాంద్ బాషా, శివ, ఇక్బాల్, బాషా, కార్మికులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిఐటియు నాయకులు



రోడ్డును పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

శిథిలమైన రోడ్డు పరిశీలన

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

రోడ్డుపై నీరు నిలిచి గుంతలు కనిపించక ప్రమాదాలు జరిగి ప్రజలు ఆస్పత్రుల పాలవుతున్నారని పట్టణ పౌర సంక్షేమ సంఘం ప్రతినిధి బృందం కలెక్టర్ వినతిపత్రం ఇచ్చింది. కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం ఎన్‌హెచ్ శాఖ ఇంజనీర్ భార్గవ, కాంట్రాక్టర్ తరపున సుధాకర్ రెడ్డి శిథిలమైన పిపిఎస్ఎస్ ప్రతినిధి బృందం సమక్షంలో నందికొట్కూరు రోడ్డును పరిశీలించారు. గణేష్ దేవాలయం సమీపంలో 30 ఏళ్ల క్రితం నాటి మోరి, ఇరుకైన రోడ్డును బాగు చేయాలని గత మూడు ఏళ్లుగా అధికారుల చుట్టూ తిరిగినా స్పందించడం లేదని తెలిపారు. ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యం వల్ల అనేకమంది ప్రమాదాలకు గురై ఆసుపత్రుల పాలయ్యారని రిటైర్డ్ ఆర్టీసీ సూపర్వైజర్ పి సి హెచ్ దస్తగిరి, పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు ఇరిగినేని పుల్లారెడ్డి, సిత్తారి వెంకటవర్మ ఇంజనీర్ దృష్టికి తెచ్చారు. అర్జీలు ఇచ్చిన ప్రతిసారి తాత్కాలిక మరమ్మతులు చేసి అధికారులు చేతులు దులుపుకుంటున్నారని తెలిపారు. ఎన్ హెచ్ శాఖ ఇంజనీర్ భార్గవ మాట్లాడుతూ ప్రమాదాలు జరుగుతున్న విషయం మా దృష్టి కూడా వచ్చిందని కలెక్టర్ ఆదేశాల మేరకు మీ సమక్షంలో పరిశీలిస్తున్నామని అన్నారు.

అతిసారపై విద్యార్థినులకు అవగాహన

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

నగరంలోని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో అతిసార వ్యాధిపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. మంగళవారం ఒఆర్ఎస్ దినోత్సవం సందర్భంగా రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ మహేశ్వర ప్రసాద్ ఆధ్వర్యంలో వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వర్షాకాలంలో నీటి కాలుష్యం, సూక్ష్మక్రిముల ప్రభావంతో అతిసార వ్యాధి వ్యాపించే అవకాశాలు ఉన్నాయని, కలుషిత నీరు, ఆహారం ద్వారా అతిసార, కలరా వ్యాధులు వ్యాపిస్తాయని తెలిపారు. వాంతులు, విరేచనాలు, కడుపునొప్పి, దాహం, నోరు ఎండిపోవడం, మూత్ర విసర్జన తగ్గిపోవడం, కళ్లు లోపలికి పోవడం, ఛర్మం సాగేగుణం కోల్పోవడం వంటి లక్షణాలు ఉంటాయని చెప్పారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని, భోజనానికి ముందు, మలవిసర్జన తర్వాత చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. నిల్వ ఉంచిన ఆహార పదార్థాలను తినరాదని, ఆహార పదార్థాలపై మూతలు ఉంచాలని తెలిపారు. ఇంటిని పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. ప్రొజెక్షనిస్ట్ ఖలీల్ పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న వైద్యులు

'స్వాతంత్ర్య వేడుకలను ఘనంగా నిర్వహించాలి'

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. మంగళవారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై కలెక్టర్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతేడాది చేపట్టే కార్యక్రమమైనా, స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నిర్వహణను అత్యంత జాగ్రత్తగా చేయాల్సి ఉంటుందని తెలిపారు. 45 నిమిషాల్లోపు సాంస్కృతిక కార్యక్రమాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని డిఇఒ శ్యామూల్ పాల్‌ను ఆదేశించారు. బ్యారికేడింగ్ వంటి ఏర్పాట్లతో పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్‌ను వేడుకలకు సిద్ధం చేయాలని ఆర్ అండ్ బి అధికారులకు సూచించారు. జాతీయ పతాకావిష్కరణ, పరేడ్ నిర్వహణకు పోలీసు శాఖ ఏర్పాట్లు చేయాలన్నారు. పెరేడ్ గ్రౌండ్స్‌లో తాగునీటి ఏర్పాట్లు, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. అదనపు ఎస్పీ (అడ్మిన్) హుస్సేన్ పీరా, డిఆర్ఒ వెంకట నారాయణమ్మ, హౌసింగ్ పీడీ చిరంజీవి, కర్నూలు నగర పాలక సంస్థ కమిషనర్ విశ్వనాథ్, కర్నూలు ఆర్‌డిఒ సందీప్ కుమార్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యేను, ఛైర్మన్‌ను సన్మానిస్తున్న నాయకులు

సహకార సంఘం ఛైర్మన్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-గూడూరు

వ్యవసాయ సహకార సంఘం పరపతి ఛైర్మన్‌గా బి దానమయ్య మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న సూపర్ సిక్స్ పథకాలు ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని నియోజకవర్గంలో ప్రతి ఇంటిలో ప్రభుత్వం చేపట్టిన పథకాలు ప్రతి ఒక్కరికి నచ్చినవేని ముఖ్యంగా తల్లివందనం పథకం ప్రతి ఇంటిలో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి తల్లివందనం పడిందని వచ్చే నెల 15న మహిళలకు ఉచిత బస్ చేపడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో టౌన్ కన్వీనర్ కే రామాంజనేయులు, పట్టణ కన్వీనర్ సురేష్ బి సజన్ కౌన్సిలర్ బుడ్డెంగిలి పాల్గొన్నారు.

పిఎం ఫసల్ బీమా యోజనకు నేడు చివరి రోజు

ప్రజాశక్తి - సి బెళగల్

ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజనకు బుధవారం చివరి రోజు అని ఎఒ మల్లేష్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం పోలకల్ లో పంటలను పరిశీలించి సస్యరక్షణ పద్ధతులపై రైతులతో మాట్లాడారు. ప్రతి రైతు అంతర పంటలపై అవగాహన పెంచుకొని తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడిని పొందాలన్నారు. అలాగే ఫసల్ బీమా పథకం చేసుకోవడం వలన పంటలు దెబ్బ తిన్నప్పుడు, వర్షాభావం నెలకొన్నప్పుడు ప్రభుత్వం నుండి పరిహారం అందుతుందని నేడు చివరి రోజు కాగా రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పంట నమోదు తప్పనిసరి : ఎఒ

ప్రజాశక్తి - వెల్దుర్తి

ప్రతి పంటనూ తప్పనిసరిగా నమోదు చేయాలని ఎఒ అక్బర్ బాషా తెలిపారు. మంగళవారం మండలంలోని వెల్దుర్తి, బొమ్మిరెడ్డి పల్లి, మల్లెపల్లి గ్రామాల్లో పంట నమోదును తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ... ఖరీఫ్‌లో సాగు చేసిన ప్రతి రైతూ పంట నమోదు చేయాలని రైతు సేవా కేంద్రం సిబ్బందిని ఆదేశించామన్నారు. పంట సాగు చేసిన రైతులు ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రం సిబ్బందిని సంప్రదించి పంట నమోదు చేసుకోవాలన్నారు. వెల్దుర్తి రైతు సేవా కేంద్రం ఎఇఒ అజయ్ భార్గవ్, ప్రణీత పాల్గొన్నారు.

'స్థాయీసంఘం' ఏకగ్రీవం..?

- నామినేషన్లు ఉపసంహరించుకున్న ఇద్దరు

- 1న నియామక పత్రాల అందజేత

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరపాలక సంస్థ స్థాయీసంఘం ఎన్నికలు ఏకగ్రీవం కానున్నాయి. ఏడుగురు కార్పొరేటర్లు నామినేషన్లు వేయగా, ఉపసంహరణ గడువు ముగిసే సమయానికి ఇద్దరు అభ్యర్థులు నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. 5 స్థానాలకు ఐదుగురే బరిలో ఉండడంతో ఎన్నిక ఏకగ్రీవం కానుంది. ఆగస్టు 1న అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేయనున్నారు.

బరిలో ఉన్న అభ్యర్థులు : అహమ్మద్ షేక్ – 50వ వార్డు, ఇప్పల నారాయణ రెడ్డి, కురువ మునెమ్మ, వై.వెంకటేశ్వర్లు, చెన్నబోయిన సాంబశివ రావు.

మతసామరస్యాన్ని కించపరిచేలా మాట్లాడిన శ్రీశైలం చెక్‌పోస్ట్ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

మతసామరస్యాన్ని కించపరిచేలా మాట్లాడిన శ్రీశైలం చెక్‌పోస్ట్ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ఆవాజ్ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు ఎస్ఏ సుభాన్, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎగ్బాల్ హుస్సేన్, ఎస్ఎండి షరీఫ్ డిమాండ్ చేశారు. మంగళవారం వారు మాట్లాడారు. ఆత్మకూర్ ఆర్టీసీ డిపో తన సేవలను ప్రారంభించిన నాటినుండి శ్రీశైలానికి ప్రయాణికులను భక్తులను చేరవేయడంలో ఆర్టీసీ డ్రైవర్ల పాత్ర ఉందని, వారి శ్రమ ఎంతో ముఖ్యమైనదని తెలిపారు. ఆర్టీసీ డ్రైవర్ టోపీ శ్రీశైలం చెక్ పోస్ట్ సిబ్బందికి ఆటంకం ఏమిటో అర్థం కావడం లేదన్నారు.. మనుషుల మధ్య మత వైశ్యామ్యాలను ఉద్రిక్తతలను పెంచే ఇలాంటి చర్యలు సమాజానికి దేవస్థానానికి మేలు చేకూరదని తెలిపారు. మతసామరస్యాన్ని సౌభ్రతత్వాన్ని భంగం కలిగేలా మాట్లాడిన సెక్యూరిటీ సిబ్బందిపై ప్రభుత్వం స్పందించి చట్టపరమైన తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగంపై ప్రమాణం చేసి అధికారం చేపట్టిన పాలకులు ఆ రాజ్యాంగం పౌరులకు కల్పించిన హక్కులపై దాడులకు పూనుకోవడం దారుణం అన్నారు. ఇలాంటి చర్యలను సహించము అంటూ ప్రకటనలు ఇస్తున్న కూటమి ప్రభుత్వం నోటితో పలకరించి నొసటితో ఎక్కిరించిన విధంగా ఉందన్నారు. ప్రశాంతంగా ఉన్న ప్రజల మధ్య వైశ్యామ్యాలు సృష్టించే వారు ఎవరైనా వారిపై చర్యలు తీసుకొని ముస్లిం మనోభావాలను గౌరవించాలని ప్రభుత్వాన్ని కోరారు.

పకడ్బందీగా పారిశుధ్య పనులు

- నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

నగరంలో పారిశుధ్య పనులపై ఫిర్యాదులు రాకుండా పకడ్బందీగా నిర్వహించాలని నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన వెంకటరమణ కాలనీ, ప్రకాష్ నగర్, రోజా వీధి, అశోక్ నగర్, బంగారుపేట, చల్లా కాంపౌండ్ ప్రాంతాల్లో పర్యటించారు. పారిశుధ్యం, అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వారానికోసారి ప్రతి వీధిలో పూడికతీత పనులు చేపట్టాలని, డ్రైయినేజీ కాలువలపై ఆక్రమణలుంటే పట్టణ ప్రణాళిక విభాగం అధికారులతో సమన్వయం చేసుకుని తొలగించాలని ఆదేశించారు. డ్రైయినేజీ కాలువల్లో పైపులు, ఇతరత్రా ఆటంకాలు ఉంటే ఇంజినీరింగ్ విభాగం అధికారుల దృష్టికి తీసుకెళ్లి తొలగించాలని సూచించారు. డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర్ రెడ్డి, ఎఇ జనార్ధన్ పాల్గొన్నారు.

'సంక్షేమ బోర్డు ఉన్నా ఫలితం సున్నా'

ప్రజాశక్తి - పత్తికొండ

భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ఉన్నా ఫలితం మాత్రం లేదని భవన నిర్మాణ కార్మిక సంఘం గౌరవాధ్యక్షులు ఎం.రవిచంద్ర, భవన నిర్మాణ కార్మిక సంఘం మండల కార్యదర్శి సి.దుగ్గన్న తెలిపారు. మంగళవారం పత్తికొండలోని మాజీ ఎమ్మెల్యే ఈశ్వర్ రెడ్డి భవన్‌లో భవన నిర్మాణ కార్మికుల సమావేశం జరిగింది. సంఘం కార్యదర్శి దుగ్గన్న అధ్యక్షత వహించారు. రవిచంద్ర మాట్లాడుతూ... వేలాది మంది భవన నిర్మాణ కార్మికులుగా బతుకుతున్నారని, వారందరికీ కార్మిక శాఖ నుంచి ఐడి కార్డులు, పథకాలు అందడం లేదని తెలిపారు. డివైఎఫ్ఐ మండల కార్యదర్శి దుగ్గెన్న, భవన నిర్మాణ కార్మిక సంఘం సహాయ కార్యదర్శి మంజు, సభ్యులు రమేష్, ఎల్లప్ప పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

ప్రతి ఇంటికీ అభివృద్ధి, సంక్షేమం : ఎమ్మెల్యే దస్తగిరి

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

కూటమి ప్రభుత్వంలో ప్రతి ఇంటికీ అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందుతున్నాయని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి తెలిపారు. మంగళవారం కర్నూలు అర్బన్ 38వ వార్డు గీతాముఖర్జీ నగర్‌లో 'సుపరిపాలనలో తొలి అడుగు' నిర్వహించారు. కూటమి ప్రభుత్వం ఏడాదిలో చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందిస్తూ, ముందుకు సాగారు. టిడిపి మండల నాయకులు సుధీర్ (బంటు), నియాజ్, సూరి, సుభాన్, వాజిద్, అయ్యన్న, డి.అబ్దుల్లా, చాంద్ పాల్గొన్నారు. **కోడుమూరు (రూరల్)** మండలం వెంకటగిరి గ్రామంలో 'సుపరిపాలన తొలి అడుగు' నిర్వహించారు. ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అంతకుముందు వెంకటగిరి గ్రామంలో ఎమ్మెల్యేకు స్థానికులు ఘన స్వాగతం పలికారు. టిడిపి మండల కన్వీనర్ లక్కిరెడ్డి రామకృష్ణారెడ్డి, రాజు, బాలకృష్ణ, నారాయణ, అయ్యప్ప, తోటయ్య, కట్టెల రాజు, ప్యాలకుర్తి వెంకటేశ్వర్లు, బలరాం, రామగిడ్డయ్య, జి.కృష్ణ, దేవరాజు పాల్గొన్నారు.



కోడుమూరు : వెంకటగిరిలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే దస్తగిరి

సిఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

కర్నూలు క్రైమ్ : కర్నూలు మండలం సుంకేసుల గ్రామానికి చెందిన ఎ.పాండురంగస్వామి గత కొద్ది రోజులుగా గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. ఇటీవల బైపాస్ సర్జరీ చేసుకున్నారు. ఆర్థిక పరిస్థితులు బాగా లేనందున వారు సహాయం కోసం కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరిని సంప్రదించారు. సిఎంఆర్ఎఫ్ పథకం కింద అప్లై చేసుకున్నారు. వారికి మంగళవారం రూ.1,29,231 చెక్కును అందజేశారు.



పరిసరాలను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

త్వరలో రైల్వే బ్రిడ్జి పనులు ప్రారంభం

- సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ప్రజాశక్తి - ఆదోని

రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులను వేగ వంతం చేసి ప్రజలకు త్వరగా రాకపోకల సౌకర్యం కల్పించాలని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం పట్టణంలోని డీఎస్పీ కార్యాలయ సమీపంలో ప్రతిపాదిత రైల్వే ఓవర్ బ్రిడ్జి స్థలాన్ని సందర్శించి, రైల్వే, మున్సిపల్, ఆర్ అండ్ బి, విద్యుత్ విభాగాల ఇంజినీర్లతో కలిసి క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు పూర్తయితే పట్టణంలో వాహనాల రద్దీ తగ్గి ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని తెలిపారు. అందుకే స్థల సేకరణ, ప్లానింగ్, నిర్మాణ సంబంధిత అన్ని పనులను సమన్వయంతో పూర్తి చేయాలని సూచించారు. తహశీల్దార్ రమేష్, ఆర్ అండ్ బి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పద్మనాభ రెడ్డి, రైల్వే ఇంజినీర్లు కనకదుర్గారావు, సత్యనారాయణ, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్స్ వేణు సూర్య, మున్సిపల్ ఇంజినీర్ గోపీనాథ్ పాల్గొన్నారు.

రుణాలు మంజూరు చేయాలి

- కెడిసిసి ఛైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డికి వినతి

ప్రజాశక్తి - గోనెగండ్ల



విష్ణువర్ధన్‌రెడ్డిని సన్మానిస్తున్న రామాంజనేయులు

రైతులకు పంట రుణాలు మంజూరు చేయాలని కెడిసిసి ఛైర్మన్ డి.విష్ణువర్ధన్ రెడ్డిని, జిల్లా సిఇఒ రామాంజనేయులును గోనెగండ్ల సొసైటీ సింగిల్ విండో ప్రెసిడెంట్ ఎన్‌వి.రామాంజనేయులు కోరారు. మంగళవారం ఆయన కర్నూలులో వారిని మర్యాదపూర్వకంగా కలిశారు. విష్ణువర్ధన్‌రెడ్డిని శాలువా, పూలమాలతో సన్మానించి, అభినందనలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ... గోనెగండ్ల సొసైటీలోని రైతులందరితో సకాలంలో రుణాలు కట్టించి, వారికి అవసరమైన ఎరువులు, సబ్సిడీ రుణాలు, విత్తనాలను ఇప్పించి సొసైటీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. అలాగే గోనెగండ్ల సొసైటీకి దీర్ఘకాలిక, పంట రుణాలను మంజూరు చేసేలా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన సానుకూలంగా స్పందించి... వెంటనే మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. టిడిపి నాయకులు శ్రీధర్ నాయుడు, పూజారి చంద్రశేఖర్, అడ్వకేట్ వెంకటేశ్వర్లు, ఎన్‌వి.బాబు నాయుడు, మద్దిలేటి పాల్గొన్నారు.

విద్యుత్ సౌధ ముట్టడిని జయప్రదం చేయండి

- యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి భీమేష్ చౌదవి



గోడ పత్రికలు విడుదల చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - గోనెగండ్ల

ఆగస్టు 7న విజయవాడలో నిర్వహించే విద్యుత్ సౌధ ముట్టడిని జయప్రదం చేయాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి భీమేష్ చౌదరి కోరారు. మంగళవారం గోనెగండ్ల సబ్ స్టేషన్‌లో అందుకు సంబంధించిన గోడపత్రికలను కాంట్రాక్టు ఎలక్ట్రిసిటీ ఉద్యోగులతో కలిసి విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. కార్మికుల చిరకాల కోరిక అయిన డైరెక్ట్ పేమెంట్, కార్మికుల రెగ్యులరైజేషన్ తదితర సమస్యలపైన విద్యుత్ సౌధ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ కాంట్రాక్టు కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ప్రవీణ్, జావిద్, కాంట్రాక్టు కార్మికులు శ్రీను, పోతప్ప, యూనుస్, పవన్, మద్దిలేటి పాల్గొన్నారు.

హైవోల్టేజీ విద్యుత్‌తో అపార నష్టం

- ఉపాధి కార్యాలయంలో కంప్యూటర్లు దగ్ధం

ప్రజాశక్తి - ఆస్పరి

హైవోల్టేజీ విద్యుత్ వల్ల మంగళవారం ఆస్పరి బస్టాండ్ పరిసరాల్లోని ఇళ్లలో టివిలు, ఫ్రిజ్‌లు, ఫ్యాన్లు కాలిపోయాయి. ఉపాధి కార్యాలయంలో రెండు కంప్యూటర్లు, జిరాక్స్ మిషన్, రెండు ఫ్యాన్లు కాలిపోయాయని, సుమారు రూ.లక్ష నష్టం వాటిల్లిందని ఏపీవో రామకృష్ణ తెలిపారు. విద్యుత్ ఎఇ ఆంజనేయ శాస్త్రికి అధికారులు సమాచారం ఇవ్వడంతో విద్యుత్ లైన్ మెన్‌ను పంపించి వెంటనే విద్యుత్ స్తంభానికి వేలాడుతున్న తీగను సరిచేసి యథావిధిగా విద్యుత్‌ను సరఫరా చేశారు.

డప్పు కళాకారుల సమస్యలు పరిష్కరించాలి

- ఎపి డికెఎస్ జిల్లా కార్యదర్శి కరుణాకర్

ప్రజాశక్తి - కౌతాళం

డప్పు కళాకారుల సమస్యలు పరిష్కరించాలని ఎపి డికెఎస్ జిల్లా కార్యదర్శి బి.కరుణాకర్ కోరారు. మంగళవారం కౌతాళంలోని సిపిఎం కార్యాలయంలో డప్పు కళాకారుల సమావేశం సంఘం మండల కార్యదర్శి చిన్న మారయ్య అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథులుగా కరుణాకర్, సిపిఎం జిల్లా నాయకులు మల్లయ్య హాజరయి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా డప్పు కళాకారుల సమస్యలపై కన్నెత్తి కూడా చూడడం లేదని విమర్శించారు. అర్హులైన డప్పు కళాకారులకు డప్పు, గజ్జలు, డ్రస్సు ప్రభుత్వమే ఇవ్వాలని, ఆరోగ్య బీమా వర్తింపజేయాలని కోరారు. అనంతరం సిపిఎం కార్యాలయం నుంచి సంత మార్కెట్, ఆంజనేయస్వామి దేవాలయం, ఖాదర్ లింగ స్వామి దర్గా మీదుగా ఎంపిడిఒ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎంపిడిఒ రాజేంద్రప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఎంపిడిఒ మాట్లాడుతూ... మండలంలో 50 ఏళ్లు నిండి డప్పు పింఛను కోసం ఎంతమంది ఎదురుచూస్తున్నారో జాబితాను తమకు అందజేయాలని, వెంటనే సమస్యలు పరిష్కరిస్తామని, సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు.

మండల కమిటీ ఏకగ్రీవ ఎన్నిక : అనంతరం మండల కమిటీని జిల్లా కార్యదర్శి కరుణాకర్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా బంటకుంట తాయప్ప, మండల కార్యదర్శిగా కరణి చిన్న మారయ్య, ఉపాధ్యక్షులుగా ఈర్లదిన్నె ఈరన్న, మల్లనహట్టి తాయప్ప, సహాయ కార్యదర్శులుగా మల్లన్న హట్టి ఎర్ర తిక్కయ్య, సులేకేరి ఉదయ్, కోశాధికారిగా సులేకేరి వీరేష్, కమిటీ సభ్యులుగా గుడి కంబాలి వసంత్, చూడి అయ్యప్ప, తిప్పాలదొడ్డి హనుమంతు, బంటకుంట ఈరన్నతోపాటు మరో నలుగురిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

బూజుపట్టిన కూరగాయలతో వంటలు

- నాసిరకం కూరగాయలు సరఫరా చేస్తున్న ఏజెన్సీ నిర్వాహకులు

- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న ప్రిన్సిపల్ - ఇబ్బందుల్లో విద్యార్థినులు

ప్రజాశక్తి - హోళగుంద





బూజుపట్టిన కూరగాయలు



బూజు పట్టిన, కుళ్లిన కూరగాయలతో సాంబారు, రసం, ఇలా చేసే ప్రతి వంటా అశుభ్రంగా ఉంది. హోళగుంద కెజిబివిలో 210 మంది విద్యార్థినులు 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుకుంటున్నారు. మంగళవారం 200 మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనం తయారు చేశారు వంట నిర్వాహకులు. బూజుపట్టిన క్యారెట్, దొండకాయతో సాంబారు చేశారు. కుళ్లిన టమోటాతో రసం చేశారు. గత్యంతరం లేక బలవంతంగా భోజనం చేసినట్లు విద్యార్థులు వాపోతున్నారు. కూరగాయలు నిల్వ చేసే గదిని పరిశీలించగా కుళ్లిన పచ్చి మిరపకాయలు, పురుగులు పట్టిన ముల్లంగి, ఫంగస్ ఏర్పడిన ఉల్లిగడ్డలు కనిపించాయి. ప్రభుత్వం మాత్రం విద్యార్థులకు నాణ్యమైన భోజనం, పౌష్టికాహారం ఇస్తున్నామని చెబుతోంది. అవి కేవలం ప్రచారానికి తప్ప వాస్తవానికి అందుకు విరుద్ధంగా నాసిరకం భోజనాన్ని వడ్డిస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి భోజనం చేస్తే విద్యార్థినుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉంది. ఇలాంటి నాసిరకం భోజనంపై గతంలో అధికారులకు ఫిర్యాదు చేసినా చూసీచూడనట్లు వ్యవహరించినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ విషయంపై కెజిబివి ప్రిన్సిపల్ దివ్య భారతిని వివరణ కోరగా... కూరగాయల కాంట్రాక్టర్‌పై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. మరోసారి ఇలాంటి తప్పిదం జరగకుండా చూస్తామని చెప్పారు.

విద్యార్థులకు అదనంగా బస్సు నడపాలి

- డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి - ఆస్పరి

విద్యార్థులకు అదనంగా బస్సు నడపాలని డివైఎఫ్ఐ మండల మాజీ నాయకులు బాలకృష్ణ, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి రవి, డివైఎఫ్ఐ మండల కార్యదర్శి అధ్యక్ష, సహాయ కార్యదర్శులు మహేంద్ర, నాగేంద్ర డిమాండ్ చేశారు. బస్సు సౌకర్యం కల్పించాలని మంగళవారం ఎపి మోడల్ స్కూల్ దగ్గర రోడ్డుపై విద్యార్థులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆస్పరి, దేవనకొండ మండలాల నుంచి విద్యార్థులు చదువుకోవడానికి మోడల్ స్కూల్‌కు వస్తున్నారని తెలిపారు. ఒకే బస్సు ఉండడంతో విద్యార్థులు ఒకరిపైఒకరు ఇరుక్కుని వెళ్లాల్సిన పరిస్థితి ఉందన్నారు. ఇటీవల దేవనకొండ మండలంలో ఆర్‌టిసి బస్సులో 230 మంది విద్యార్థులను ఎక్కించడంతో ఊపిరాడక అస్వస్థతకు గురయ్యారని తెలిపారు. ఆర్‌టిసి డిపో అధికారులు మరో బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షులు ధనుంజయ్, దేవనకొండ మండల కార్యదర్శి శ్రీనివాసులు, నాయకులు రామాంజిని, శివ పాల్గొన్నారు.




రోడ్డుపై ధర్నా చేస్తున్న విద్యార్థులు, నాయకులు

మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన 'కూటమి'

- వైసిపి జిల్లా కార్యదర్శి మురళీమోహన్‌రెడ్డి

ప్రజాశక్తి - కోసిగి

కూటమి ప్రభుత్వం మోసపూరిత హామీలతో గద్దెనెక్కిందని వైసిపి జిల్లా కార్యదర్శి మురళీమోహన్ రెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని దుద్ది గ్రామంలో 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ' నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే బాల నాగిరెడ్డి ఆదేశాల మేరకు ప్రతి గ్రామానికీ వెళ్లి చంద్రబాబు చేసిన మోసాన్ని ఎండగడతామన్నారు. ఏ గడపకు వెళ్లినా కూటమి ప్రభుత్వంపై ఎవరూ సంతృప్తిగా లేరని తెలిపారు. ఇచ్చిన హామీల్లోనూ అరకొరగా నెరవేర్చారని విమర్శించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి గ్రామంలోనూ వైసిపి జెండా ఎగరవేసి, గ్రామాభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఎంపిపి పెండే కల్లు ఈరన్న, బసిరెడ్డి, వీరారెడ్డి, దుద్ది గ్రామ నాయకులు నాగేష్, రామలింగ పాల్గొన్నారు.



క్యూఆర్ స్కానర్లను ఇస్తున్న వైసిపి నాయకులు

ప్రభుత్వ పాఠశాలలో సమస్యలు : సిపిఎం

ప్రజాశక్తి-ఆలూరు

ఆలూరులోని ప్రభుత్వ పాఠశాలలో సమస్యలు వెలువెత్తుతున్నాయని సిపిఎం ఆలూరు ప్రాంతీయ కార్యదర్శి పి.హనుమంతు, సీనియర్ నాయకులు కెపి.నారాయణ స్వామి తెలిపారు. మంగళవారం ఆలూరు ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకునేందుకు పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పాఠశాలలో అదనపు తరగతి గదులు, ఉపాధ్యాయుల కొరత, తాగునీటి సమస్య, మధ్యాహ్న భోజనం, యూనిఫారం, పాఠ్య పుస్తకాలు అందలేదని విద్యార్థులు తమ దృష్టికి తీసుకొచ్చినట్లు తెలిపారు. ఆలూరు ప్రభుత్వ బాలుర పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉందని, 24 మంది ఉపాధ్యాయులు ఉండాల్సిన చోట ఏడుగురు మాత్రమే ఉన్నారని చెప్పారు. తాగునీటి సమస్యతో బోరు నీరు తాగి అనారోగ్యానికి గురవుతున్నారని తెలిపారు. మోడల్ స్కూల్‌లో పెండింగ్‌లో ఉన్న అదనపు తరగతి గదులను పూర్తి చేసి, చెడిపోయిన వాటర్ ప్లాంట్‌ను బాగు చేయించాలని కోరారు. బాలికల ఉన్నత పాఠశాలలో ఓల్టేజ్ సమస్య వల్ల తీగలు కాలి పోతున్నాయని తెలిపారు. 6వ తరగతి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫారం వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎంఇఒ కోమలాదేవికి వినతిపత్రం అందజేశారు. సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సిపిఎం ఆలూరు ప్రాంతీయ నాయకులు కృష్ణ, మైనా, గోవర్ధన్, విఠల్, సోమశేఖర్, నాగరాజు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఇన్‌ఛార్జ్ ఎంపిడిఒగా గోపాల్

ప్రజాశక్తి - దేవనకొండ



దేవనకొండ మండల పరిషత్ కార్యాలయానికి ఇన్‌ఛార్జీ ఎంపిడిఒగా డిప్యూటీ ఎంపిడిఒ గోపాల్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. రెగ్యులర్ ఎంపిడిఒ జ్యోతి పరిపాలన విభాగాలపై శ్రీకాళహస్తిలో నెల రోజుల పాటు జరిగే శిక్షణ తరగతులకు వెళ్లారు. ఇన్‌ఛార్జీ ఎంపిడిఒగా డిప్యూటీ ఎంపిడిఒ గోపాల్‌కు జిల్లా అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

'శ్మశానానికి అదనపు స్థలానికి విన్నవించుకోండి'

ప్రజాశక్తి- దేవనకొండ

మండలంలోని తెర్నేకల్లు గ్రామంలో కొండ మాధవ స్వామి దేవాలయం సమీపంలో ఎస్సీ (మాల)లకు ఉన్న శ్మశానానికి అదనపు స్థలం కోసం దరఖాస్తు ద్వారా విన్నవించుకోవాలని తహశీల్దార్ రామాంజనేయులు, సిఐ వంశీనాథ్ తెలిపారు. మంగళవారం ఆలయ సమీపంలోని శ్మశాన స్థలం విషయంపై గ్రామంలో సామాజిక వర్గాల మధ్య వివాదం నెలకొనడంతో వారు ఆ గ్రామానికి వెళ్లి శ్మశాన స్థలాన్ని పరిశీలించారు. గ్రామకంఠంలో ఉన్న దేవాలయ సమీపంలోకి శ్మశాన స్థల విస్తరణ చేయరాదని, ఏదైనా దరఖాస్తు రూపంలో సమస్యను విన్నవించుకోవాలని తెలిపారు. సొంత నిర్ణయాలు తీసుకోరాదని చెప్పారు.

హోళగుంద, ఢణాపురం హైవేకు ప్రతిపాదనలు

- టిడిపి సీనియర్ నాయకులు శివ ప్రకాష్

ప్రజాశక్తి - హోళగుంద

హోళగుంద, ఢణాపురం రోడ్డు హైవేగా ప్రతిపాదనలు చేసినట్లు టిడిపి ఆలూరు నియోజకవర్గ సీనియర్ నాయకులు శివ ప్రకాష్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడారు. పుష్కలంగా నీరు ఉన్నా వాటిని సక్రమంగా వినియోగించుకోకపోవడంతో నియోజకవర్గం అభివృద్ధిలో వెనుకబడిందని, వేదవతి ప్రాజెక్టును పూర్తి చేసుకుంటే నియోజకవర్గంలో సాగు, తాగునీటి సమస్య లేకుండా సస్యశ్యామలంగా మారుతుందని చెప్పారు. విజయవాడ నుంచి హుబ్లీ మీదుగా గోవా వెళ్లడానికి హోళగుంద, ఢణాపురం రోడ్డును హైవేగా మార్చి గోవా వెళ్లడానికి సులువుగా ఉంటుందని ప్రతిపాదనలు జారీ చేశారని తెలిపారు. మండల అభివృద్ధికి హైవే రోడ్డు వేయడానికి తన సొంత పొలాలను సైతం ప్రభుత్వానికి ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నానని చెప్పారు. ఎమ్మెల్యే బి.విరుపాక్షి పార్టీలకతీతంగా నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

సారా, కర్ణాటక మద్యం విక్రయదారులపై పిడి యాక్ట్

ప్రజాశక్తి - ఆదోని

నాటు సారా తయారు చేసినా, విక్రయించినా, కర్ణాటక మద్యం రవాణా చేసిన వారిపై పిడి యాక్ట్ కేసులు నమోదు చేస్తామని ప్రొహిబిషన్, ఎక్సైజ్ సిఐ సైదుల్ తెలిపారు. మంగళవారం పలువురు నిందితులపై బైండోవర్ చేశామని, వారి వివరాలు వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ... నవోదయం 2.0లో భాగంగా నాటుసారా కేసుల్లో బైండోవర్ చేసిన ఆదోని వాల్మీకి నగర్‌కు చెందిన బోయ మురళీ, బోయ కార్తికేయ, బోయ లాలు, బోయ సురేష్, బోయ నాగిరెడ్డి, బోయ హరి కృష్ణ, జగ్గాపురం ఈరన్న, హనుమాన్ నగర్‌కు చెందిన బోయ రమేష్‌ను ఆదోని తహశీల్దార్ ముందు హాజరు పర్చగా ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున జరిమానా విధించినట్లు తెలిపారు. కర్ణాటక మద్యం కేసుల్లోని 8 మంది పాత నేరస్తులను 129 బిఎన్‌ఎస్ఎస్ చట్టం కింద కౌతాళం తహశీల్దార్ వద్ద బైండోవర్ చేశామన్నారు.

అంకితభావంతో విధులు

- సిడిపిఒ ఉమామహేశ్వరి

ప్రజాశక్తి - ఆదోని



విధుల పట్ల అంకిత భావంతో ఉండడం సంతృప్తిగా ఉందని ఐసిడిఎస్ ఆదోని సిడిపిఒ ఉమామహేశ్వరి తెలిపారు. ఈనెల 31న ఉద్యోగ విరమణ సందర్భంగా మంగళవారం ఆమె ప్రజాశక్తితో మాట్లాడారు. గ్రూపు-3 టెస్ట్‌లో అర్హత పొంది 1989 ఆగస్టులో విలేజ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా (ఉమెన్) గడివేములలో ఉద్యోగ బాధ్యతలు చేపట్టామని తెలిపారు. 1991లో ఐసిడిఎస్ సూపర్‌వైజర్‌గా బాధ్యతలు తీసుకున్నామని చెప్పారు. అప్పటి నుంచి పెనుగొండ, ఆలూరు, నందికొట్కూరు, డోన్ ప్రాంతాల్లో విధులు నిర్వహించామన్నారు. 2009లో సిడిపిఒగా ఉద్యోగోన్నతి పొంది డోన్‌లో బాధ్యతలు తీసుకున్నామని తెలిపారు. కర్నూలు మహిళా ప్రాంగణం జిల్లా మేనేజర్‌గా బాధ్యతలు తీసుకొని ఎందరో తల్లి లేక తండ్రి లేని బాలికలకు మంచి సదుపాయాలు కల్పించే దిశగా బాధ్యతలు నిర్వహించినట్లు చెప్పారు. యూనిసెఫ్ సహకారంతో మల్టీపర్పస్ హెల్త్ వర్కర్ శిక్షణ ఇప్పించి 40 మంది బాలికలు ఉద్యోగాల్లో చేరేందుకు సహకరించామని తెలిపారు. అక్కడి నుంచి కోడుమూరు, ఆదోని ప్రాంతాల్లో సిడిపిఒగా పని చేశామన్నారు. 35 ఏళ్ల పాటు ఎలాంటి ఆరోపణలకూ తావు లేకుండా బాధ్యతలు నిర్వహించి సంతృప్తికరంగా ఉద్యోగ విరమణ పొందుతున్నామని చెప్పారు. తల్లి లేదా తండ్రి చనిపోయిన అమ్మాయిల విద్యాభివృద్ధికి కాలేజ్, హోమ్ సదుపాయం తెలియజేసి మెరుగైన విద్య అందేలా కృషి చేశామన్నారు. అనంతపురం, తిరుపతి, హైదరాబాద్ ప్రాంతాల్లో చదివేలా శ్రద్ధ తీసుకున్నామని తెలిపారు. బాల్య వివాహాలు అరికట్టడం, చిన్నారులకు పోషకాహారం సక్రమంగా అందేలా, గర్భిణీ, బాలింతలకు రక్తహీనత రాకుండా ఎన్నో అవగాహన కార్యక్రమాలు చేపట్టామన్నారు. తన భర్త వెంకటసుబ్బయ్య లైఫ్ ఇన్స్యూరెన్స్ కార్పొరేషన్‌లో డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా కర్నూలులో విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారని చెప్పారు. అమ్మాయి విదేశాల్లో ఉద్యోగం చేస్తున్నట్లు, ఇద్దరు కుమారులు చదువుతున్నట్లు వివరించారు. 6 నుంచి 10వ తరగతి వరకు ఆదోని మున్సిపల్ స్కూల్‌లో చదువుకున్నామని, తన తండ్రి ఆదోని రిజిస్టర్ ఆఫీసులో విధులు నిర్వహించేవారని తెలిపారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు


- వాల్మీకి ఫెడరేషన్ ఛైర్మన్ బొజ్జమ్మ

ప్రజాశక్తి - ఆస్పరి


ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించడమే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముందుకు సాగుతున్నారని రాష్ట్ర వాల్మీకి ఫెడరేషన్ ఛైర్మన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ, టిడిపి రాష్ట్ర మహిళా నాయకులు వైకుంఠం జ్యోతి, టిడిపి ఆలూరు మాజీ ఇన్‌ఛార్జీ వైకుంఠం శివప్రసాద్ తెలిపారు. మంగళవారం ఆస్పరిలో 'సుపరిపాలనలో తొలి అడుగు' నిర్వహించారు. టిడిపి మండల కన్వీనర్ పరమా రెడ్డి అధ్యక్షతన ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ వారి సమస్యలను తెలుసుకున్నారు. ముందుగా మాజీ ఎంపిపిలు రత్నమ్మ, వెంకటేష్, సొసైటీ మాజీ డైరెక్టర్ కృష్ణలు పూలమాలలు వేసి, బాణసంచా పేలుస్తూ ఘన స్వాగతం పలికారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కురువ కార్పొరేషన్ డైరెక్టర్ ఉదయ్ కుమార్, సొసైటీ మాజీ ఛైర్మన్ నౌనే పాటి చౌదరి, మండల మాజీ కన్వీనర్లు తిమ్మన్న, శ్రీనివాస గౌడ్, ఎంపిటిసి నరసప్ప, మాజీ సర్పంచి వరద రాజులు, జనసేన మండల కన్వీనర్ అరవింద్, నాయకులు నర్సిరెడ్డి, వెంకటేష్ చౌదరి, చిట్టి, రఘు, వెంకటేష్, ప్రకాష్, మహానంది పాల్గొన్నారు.

ఆదోని : ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని టిడిపి సీనియర్ నాయకులు సూరం భాస్కర్ రెడ్డి తెలిపారు. పట్టణంలోని 37వ వార్డు దేవినగర్‌లో స్థానిక నాయకులు ఖాసీం, జావిద్, సర్వర్, సాధిక్, అల్తాఫ్ ఆధ్వర్యంలో 'సుపరిపాలనలో తొలి అడుగు' నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి సమస్యలు తెలుసుకున్నారు. నాయకులు సౌదీ రావుఫ్, మాజీ కౌన్సిలర్ రామచంద్ర, ఫక్రుద్దీన్, గోపాల్ రెడ్డి, బుద్ధారెడ్డి, మాజీ కౌన్సిలర్ మల్లికార్జున, సోమశేఖర్ రెడ్డి, బి.నాగరాజ్, బీటీ.శీనా, శ్రీనివాసులు, మద్దికెర రామకృష్ణ, వాల్మీకి మల్లేశప్ప, షేక్షావలీ, వాల్మీకి రాముడు, ఎమ్‌డి.హుస్సేన్, చుక్కా గోవిందరాజులు, తిక్కన్న, రమేష్, సోషల్ మీడియా కార్యకర్త మదిరే శ్రీనివాసులు పాల్గొన్నారు.

నందవరం : ప్రజలను తప్పుదోవ పట్టించడానికి వైసిపి నాయకులు కొత్త అవతారం ప్రారంభించారని టిడిపి నాయకులు ఖాసీం వలీ, ముగతి ఈరన్న గౌడ్, నాగలదిన్నె జబ్బార్, ఈరన్న విమర్శించారు. మండలంలోని ముగతి, నాగలదిన్నె గ్రామాల్లో 'సుపరిపాలనలో తొలిఅడుగు' నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ' అంటూ వైసిపి నాయకులు ప్రజల్లోకి పోవాలని చూస్తున్నారని, ఏ పార్టీ మోసం చేసిందో ప్రజలకు తెలుసని, వారి మాటలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని తెలిపారు. టౌన్ బ్యాంకు ఉపాధ్యక్షులు నరసప్ప, గోవర్ధన్ రెడ్డి, ఎల్ఎల్‌సి డైరెక్టర్, భార్గవ్, టిడిపి యువ నాయకులు, రవి గౌడ్, గౌస్, శాంతి, ఉరుకుందు, మునాఫ్, తిమ్మప్ప, సామ్యేలు, వెంకట్రాంరెడ్డి, రంగయ్య శెట్టి పాల్గొన్నారు.



ఆస్పరిలో మాట్లాడుతున్న బొజ్జమ్మ



ఆదోనిలో కరపత్రాలు ఇస్తున్న సూరం భాస్కర్ రెడ్డి



నందవరంలో కరపత్రాలు ఇస్తున్న నాయకులు

రికార్డు స్థాయిలో హుండీ ఆదాయం

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలోని శ్రీరాఘవేంద్ర స్వామి మఠం హుండీ ఆదాయం రికార్డు స్థాయికి చేరుకున్నట్లు శ్రీమఠం మేనేజర్ ఎస్‌కె.శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడారు. రాఘవేంద్రస్వామి దర్శనార్థమై దేశ నలుమూలల నుంచి వచ్చిన భక్తులు కానుకల రూపంలో హుండీలో వేసిన ఆదాయాన్ని లెక్కించినట్లు తెలిపారు. 35 రోజుల హుండీ ఆదాయం నగదు రూపంలో మొత్తం రూ.5,46,06,555, బంగారం 127 గ్రాములు, వెండి 1820 గ్రాములు వచ్చినట్లు పేర్కొన్నారు. శ్రీమఠం మేనేజర్లు వెంకటేష్ జ్యోషి, సురేష్ కోనాపూర్ పాల్గొన్నారు.



విధులతోపాటు సేవా కార్యక్రమాలు

- ఎల్ఐసి హెచ్‌జిఎ ప్రకాష్

ప్రజాశక్తి - ఆదోని

విధులు నిర్వర్తిస్తూనే సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించి, అందరిలో ఒకరిగా ఉంటూ ఈనెల 31న ఉద్యోగ విరమణ పొందుతున్నట్లు ప్రకాష్ తెలిపారు. మంగళవారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. ఐసిఇయు ఆదోని యూనిట్ అధ్యక్షులుగా కొనసాగుతూ ఆదోని ఎల్ఐసి బ్రాంచిలో హెచ్‌జిఎగా విరమణ పొందుతున్నట్లు తెలిపారు. ఆదోనిలో జులై 10, 1965న ఆలప్ప, పార్వతమ్మ దంపతులకు జన్మించానని, తన 12 ఏళ్ల వయస్సులో తండ్రిని కోల్పోయి తల్లి ఆలంబనలో బాధ్యతగా ఎదిగొచ్చామని తెలిపారు. ఆదోనిలో డిగ్రీ వరకు చదివి ఎస్‌వి యూనివర్సిటీలో ఎంఎస్‌సి ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించినట్లు చెప్పారు. ఎల్ఐసిలో జనవరి 19, 1987న కడప బ్రాంచిలో అసిస్టెంట్‌గా ఉద్యోగ ప్రస్థానం మొదలైందన్నారు. ఆదోనిలో అసిస్టెంట్‌గా, క్యాషియర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తూ యూనియన్ కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొంటూ వచ్చామని తెలిపారు. జనవరి 10, 1997న హెచ్‌జిఎగా ప్రమోషన్ పొంది ఆత్మకూరులో చేరి, ఎమ్మిగనూరు పని చేస్తూ మార్చి 1, 2000న ఆదోనికి బదిలీపై తిరిగి చేరుకుని, రిటైరయ్యే వరకు కొనసాగమన్నారు. ఇన్స్యూరెన్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా నుంచి అసోసియేట్ పరీక్షల్లో ఉత్తీర్ణులయ్యానని, కెరీర్ పరంగా ఎదగడానికి అవకాశాలు పుష్కలంగా ఉన్నా హెచ్‌జిఎగా కొనసాగాలని నిర్ణయించుకొని సంస్థకు, యూనియన్‌కు, సమాజానికి నిబద్ధమైన సేవలు అందిస్తూ వచ్చామని చెప్పారు. ఆదోని యూనిట్ కార్యదర్శిగా, అధ్యక్షులుగా సుదీర్ఘకాలం మంచి అవగాహనతో, పరిణతితో సేవలు అందించామన్నారు. ఐసిఇయు, కడప డివిజన్ ఉపాధ్యక్షులుగా కొనసాగి ఐసిజెయు నాయకులుగా సిఐటియు, టీచర్స్, బ్యాంక్ సంఘాలతో సన్నిహిత సంబంధాలు నడుపుతూ యూనిట్ కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొన్నామని తెలిపారు. వివేకానంద సేవాసంస్థ కార్యకలాపాల నిర్వహణలో, వివిధ రకాల సేవా కార్యక్రమాల్లో ముఖ్యపాత్ర పోసిస్తున్నామని చెప్పారు. తనకు భార్య లీలావతి, ఇద్దరు పిల్లలు హిమజ, సాయిహర్ష ఉన్నారని చెప్పారు.



పచ్చని చెట్లుకు గొడ్డలి వేటు

- 20 ఏళ్లుగా విద్యార్థులకు నీడనిస్తున్న చెట్లు - పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - హోళగుంద



పర్యావరణ పరిరక్షణతో పాటు పచ్చదనాన్ని పెంచేందుకు ప్రభుత్వం ఓ వైపు మొక్కలు నాటుతుంటే.. మరోవైపు కొందరు ఏపుగా పెరిగిన పచ్చని చెట్లను నరికేస్తున్నారు. స్థానిక కెజిబివిలో 20 ఏళ్లుగా విద్యార్థులకు నీడనిస్తున్న పచ్చని చెట్లను అధికారులు నరికించారు. ఇన్ని రోజులు ఎంతో ఆహ్లాదాన్నిచ్చిన పచ్చని చెట్లు లేక పాఠశాల ఆవరణం బోసిపోయి కనిపిస్తోంది. కెజిబివి ప్రిన్సిపల్ దివ్యభారతిని వివరణ కోరగా... చెట్ల కొమ్మలు నరకమని సిబ్బందికి చెప్పానని, వారు చెట్లను నరికారని తెలిపారు.

డ్రగ్స్ జోలికి వెళ్లొద్దు : సిఐ రామలింగప్ప

ప్రజాశక్తి - ఆదోని




విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న సిఐ రామలింగప్ప

మాదకద్రవ్యాల అలవాటుతో భవిష్యత్తు నాశనమవుతుందని, వాటి జోలికి వెళ్లొద్దని మూడో పట్టణ సిఐ రామలింగప్ప, ఈగల్ క్లబ్ ఎస్ఐ సుజన్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం ఆర్ట్స్ కళాశాల, మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు జిల్లా ఈగల్ క్లబ్ ఆధ్వర్యంలో 'డ్రగ్స్ వద్దు బ్రో' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గంజాయి, ఇతర మాదకద్రవ్యాల వినియోగం వల్ల యువత భవిష్యత్తు అంధకారంలోకి నెట్టబడుతోందని తెలిపారు. ప్రతి ఒక్కరూ మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాటం చేయాలన్నారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేసి విద్యార్థులతో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. ఈగల్ క్లబ్ సభ్యులు ఎలీషా, మస్తాన్ వలీ, రమేష్, వైస్ ప్రిన్సిపల్ బాలస్వామి, మున్సిపల్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున, ఉపాధ్యాయులు సుధాకర్, అధ్యాపకులు చంద్రశేఖర్, జోనాథన్ వీక్లీప్, వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.

సురేంద్ర రెడ్డి ఎంపిక పట్ల హర్షం

ప్రజాశక్తి - దేవనకొండ

వైసిపి రాష్ట్ర కార్యదర్శిగా తెర్నేకల్ సురేంద్ర రెడ్డిని నియమించడం పట్ల వైసిపి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం తెర్నేకల్ సర్పంచి, పంచాయతీ రాజ్ నియోజకవర్గ అధ్యక్షులు మొగతాల్ అరుణ్ కుమార్, ఉప సర్పంచి కనుకు సులోచనమ్మ భర్త కనుకు వీరన్న, ఎంపిటిసి నామాల శ్రీనివాసులు, మాజీ ఎంపిటిసి కురువ ఈరన్నలు సురేంద్ర రెడ్డిని ఘనంగా సన్మానించారు. వార్డు సభ్యులు చెరువు దొడ్డప్ప, క్రిస్టియన్, మైనార్టీ మండల అధ్యక్షులు పులి నరేష్, వైసిపి నాయుకులు లింగన్న, ఏసేపు, నాగన్న, నరసింహులు, ఏసేపు, నాగప్ప, సుందర్ రాజు, మాదన్న పాల్గొన్నారు.



సురేంద్ర రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

యూరియా అధికంగా వేస్తే పురుగుల బెడద : ఎడిఎ వేదమణి



మాట్లాడుతున్న ఎడిఎ వేదమణి

ప్రజాశక్తి - దేవనకొండ

రైతులు పంటల్లో యూరియాను అధికంగా వాడితే పురుగుల బెడద అధికమవుతుందని జిల్లా వనరుల కేంద్రం ఎడిఎ వేదమణి తెలిపారు. మంగళవారం మండలంలోని తెర్నేకల్ గ్రామంలో రైతు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎఒ బి.ఉషారాణి అధ్యక్షత వహించారు. ఎడిఎ వేదమణి ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. పత్తి పంట మొదటి దశలో ఎకరాకు 10 కిలోల యూరియా మాత్రమే వేయాలని, అధికంగా వాడితే రసం పీల్చే పురుగు, దోమ బెడద ఉంటుందని తెలిపారు. రసం పీల్చే పురుగు నివారణకు కిలో విత్తనానికి 9 మిల్లీలీటర్ల ఇమిడా క్లోరోఫిడ్ విత్తనశుద్ధి చేయాలన్నారు. పురుగు ఉధృతి నివారణకు ఎకరాకు 20 పసుపు రంగు జిగురు అట్టల మొక్కకు అడుగు పైభాగంలో పెట్టుకోవాలని, 60 రోజులు నియోనికోటినాయిడ్ పురుగుమందు, ఎసిట మప్రిడ్ లేదా వేప నూనె పిచికారి చేసుకోవాలని సూచించారు. వేరుశనగ పంట విత్తిన 40 రోజులకు ఎకరాకు 200 కిలోల జిప్సం వేసుకోవాలని, దీనివల్ల ఊడలు వృద్ధి చెంది అధిక దిగుబడులు వస్తాయని తెలిపారు. ఎఇఒలు మల్లికార్జున, అబ్దుల్ సలాం, విఎఎలు షబానా పాల్గొన్నారు.

నానో యూరియా, డిఎపి వాడకం పెంచాలి : ఎడిఎ శాలురెడ్డి

ప్రజాశక్తి -కోడుమూరు రూరల్



మాట్లాడుతున్న శాలురెడ్డి

నానో యూరియా, నానో డిఎపి వాడకం పెంచాలని ఎడిఎ శాలురెడ్డి సూచించారు. మంగళవారం మండలంలోని పాలకుర్తి గ్రామంలో 'పొలం పిలుస్తుంది' నిర్వహించారు. ఎడిఎ శాలు రెడ్డి, ఎఒ రవి ప్రకాష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నానో యూరియా, నానో డిఎపి వాడకం వల్ల పంటల దిగుబడి పెరిగి భూసారం పెరుగుతుందని తెలిపారు. కంది పంటకు ఎకరాకు 500 మిల్లీలీటర్ల నానో యూరియా స్ప్రే చేసుకోవాలని, ప్రతి పంటలోనూ నానో యూరియాను స్ప్రే చేసుకోవాలని సూచించారు. పంటలో కంది సాలు పొడవునా నాగలితో దున్నడం ద్వారా వర్షానికి నీరు భూమిలోకి ఇంకి తేమశాతం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. పత్తిలో జిగురు అట్టలను ఏర్పాటు చేసుకొని చీడపీడల్ని నివారించుకోవాలని చెప్పారు. క్రాప్ లోన్ తీసుకునే రైతులు వేరుశనగకు, పత్తికి, ఇన్స్యూరెన్స్ చేసుకోవడానికి ఈ నెల 31 వరకు అవకాశం ఉందని, ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు.

రాత్రి వేళ గస్తీ పటిష్టం : ఎస్పీ



లాడ్జిల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్పీ

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

రాత్రి గస్తీని పటిష్టం చేసి నేరాల నియంత్రణకు కృషి చేయాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ పోలీసు అధికారులను ఆదేశించారు. మంగళవారం కర్నూలు పోలీసులు రాత్రి వేళల్లో గస్తీని పటిష్టం చేశారు. అర్ధరాత్రి దాటిన తర్వాత లాడ్జిల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఎవరైనా అనుమానస్పదంగా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. అనుమానం వ్యక్త పరిచిన వారి వివరాలను ఆరా తీశారు. లాడ్జిల్లో రాత్రి బస చేసే వారి గుర్తింపు కార్డులు తీసుకొని వివరాలు నమోదు చేయాలన్నారు. పరిసరాలు స్పష్టంగా కనిపించేలా తప్పనిసరిగా సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, లాడ్జీల యజమానులు పోలీసులకు సహకరించాలని తెలిపారు.

హంద్రీ వెంట ఉండే కంప చెట్లు తొలగించాలి : సిపిఎం



పరిసరాలను పరిశీలిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

స్థానిక బుధవార్ పేట 15వ వార్డు కొత్త బ్రిడ్జి నుండి స్మశానం వరకు కంప చెట్లను తొలగించాలని సిపిఎం వార్డు పర్యటన సందర్భంగా మంగళవారం సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు కె.రామకృష్ణ, నగర్ కమిటీ సభ్యులు ఆర్.కృష్ణ, సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు కె.రాముడు మాట్లాడుతూ బుధవార్ పేట దళిత నిరుపేద ప్రజలు హంద్రీ వెంబడి గుడిసెలు వేసుకొని జీవనం కొనసాగిస్తున్నారు. ఆ గుడిసెలలోకి పాములు, తేళ్లు క్రిమి కీటకాల చేరి గుడిసెలలో ఉన్నటువంటి ప్రజలు రాత్రుల నిద్రించే సమయంలో పాములు తేలు వస్తున్నాయని భయపడుతున్నారు. ఇళ్లల్లో ఇబ్బంది పడుతున్నారు. తక్షణమే మున్సిపల్ కమిషనర్ అధికారులు హంద్రీ వెంట ఉండే కంప చెట్లను తొలగించాలని డిమాండ్ చేశారు.

మున్సిపాల్టీ స్కూళ్లలో మౌలిక వసతులు కల్పించాలి



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

ప్రభుత్వ మున్సిపాలిటీ స్కూళ్లలో, మున్సిపల్ కార్పొరేషన్ ఉర్దూ హై స్కూల్‌లలో మౌలిక వస్తులు కల్పించాలని సిపిఎం నగర నాయకులు రాజశేఖర్, అబ్దుల్ దేశాయ్ నాగస్వాములు, చాంద్ బాషా స్కూల్ పర్యటన చేసి స్కూళ్లలో ఉన్న సమస్యలను తెలుసుకున్నారు. వైసిపి ప్రభుత్వంలో రాష్ట్రంలో ఉన్న మున్సిపాలిటీ స్కూల్స్‌లన్నీ చాలా బిల్డింగులు నాడు నేడు కార్యక్రమంలో పాతవి స్కూల్స్ బిల్డింగ్లలో కొత్త నిర్మాణ బిల్డింగ్లను చేయాలని గత మూడు సంవత్సరాల నుంచి పెండింగ్లో ఉన్నాయన్నారు. ఇప్పటికైనా టిడిపి కూటమి ప్రభుత్వం కొత్త భవనాల నిర్మాణం, టీచర్లు కొరత లేకుండా చేయాలని నాయకులు డిమాండ్ చేశారు.

మోడల్ స్కూల్ అభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

మోడల్ స్కూల్ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి తెలిపారు. మంగళవారం ఓర్వకల్లు మోడల్ స్కూల్‌లో పిఎం శ్రీపథకం కింద మోడల్ స్కూల్ ఎంపిక కావడం పట్ల అభినందన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి, డిఇఒ ఎస్.శామ్యూల్ పాల్ హాజరయి మాట్లాడారు. మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలను ఈ పథకం కింద కల్పిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించేందుకు అధ్యాపకులు కృషి చేయాలని కోరారు. తహశీల్దార్ విద్యాసాగర్, ఎంపిడిఒ శ్రీనివాసులు, ఎంఇఒ ఓంకార్ యాదవ్ పాల్గొన్నారు.

పాఠశాలలో అన్ని వసతులూ కల్పిస్తాం

- గ్రామ పెద్ద బొమ్మన దశరథ రామిరెడ్డి

ప్రజాశక్తి వెల్దుర్తి

పట్టణంలోని 4వ వార్డులో ఉన్న ఎబిఎం ఎ డేట్ పాఠశాలలో అన్ని వసతులూ కల్పిస్తామని గ్రామ పెద్ద బొమ్మన దశరథ రామిరెడ్డి తెలిపారు. మంగళవారం పాఠశాలను సందర్శించి మాట్లాడారు. పాఠశాలకు కావాల్సిన మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం పాఠశాల ఆవరణలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు.

యుజి 2, 4వ సెమిస్టర్ ఫలితాలు విడుదల



క్లస్టర్ వర్సిటీ సెమిస్టర్ ఫలితాలను విడుదల చేసిన ఇన్‌ఛార్జీ వీసీ

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

క్లస్టర్ యూనివర్సిటీ యుజి 2, 4వ సెమిస్టర్ ఫలితాలను ఇన్‌ఛార్జీ వీసీ వి.వెంకట బసవరావు, రిజిస్ట్రార్ డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు మంగళవారం విడుదల చేశారు. 2వ సెమిస్టర్‌లో మొత్తం 939 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 532 మంది ఉత్తీర్ణులయ్యారు. 4వ సెమిస్టర్‌లో 827 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 590 మంది ఉత్తీర్ణత సాధించారని క్లస్టర్ యూనివర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ కె.బాలసుబ్రమణ్యం తెలిపారు. రాయలసీమ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య బోయ విజయకుమార్ నాయుడు, క్లస్టర్ యూనివర్సిటీ డీన్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ కె.నాగరాజ్ శెట్టి పాల్గొన్నారు.

వైభవంగా సింగారయ్య స్వామి రథోత్సవం

ప్రజాశక్తి - సిబెళగల్

పోలకల్‌లో సింగారయ్య స్వామి 186వ రథోత్సవం మంగళవారం వైభవంగా సాగింది. పీఠాధిపతులు రాజయ్య స్వామి సమక్షంలో సింగారయ్య స్వామి ఆశీనులయ్యారు. భక్తజన సందోహం మధ్య రథోత్సవ వేడుకలు వైభవంగా సాగాయి. భక్తులకు, మహిళలకు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఎస్ఐ పరమేష్ నాయక్ పోలీస్ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

తాగు, సాగునీటి సమస్య పరిష్కారం : టిడిపి

ప్రజాశక్తి -కోడుమూరు రూరల్

పట్టణానికి తాగు, సాగునీటి సమస్యను కెడిసిసి ఛైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి పరిష్కరించాలని టిడిపి మండల కన్వీనర్ రామకృష్ణారెడ్డి తెలిపారు. మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నీటి సమస్యను విష్ణువర్ధన్ రెడ్డి, ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి దృష్టికి తీసుకెళ్లగా 50 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారని తెలిపారు. ఇంకా అవసరమైతే ఎక్కువ నీటిని విడుదల చేసేందుకు కృషి చేస్తారని చెప్పారు. టిడిపి మండల కార్యదర్శి వెంకటగిరి రాజు, అయ్యప్ప, బాలకృష్ణ, బలరాం పాల్గొన్నారు.

నిబంధనలు పాటిస్తేనే గుర్తింపు ఇవ్వాలి : ఎఐఎస్ఎఫ్

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

బిఇడి కళాశాలలు నిబంధనలు పాటిస్తేనే గుర్తింపు ఇవ్వాలని ఎఐఎస్ఎఫ్ నాయకులు శరత్, శ్రీనివాసులు డిమాండ్ చేశారు. మంగళవారం నగర శివారులోని బిఇడి కళాశాలలు ఎదుట ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న కళాశాలల గుర్తింపును రద్దు చేయాలని కోరారు. బిఇడి కళాశాలలు పూర్తిస్థాయిలో అవినీతి, అక్రమాలకు నిలయాలుగా మారాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.